


24.6 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - సాలూరు రూరల్

ఒడిశా నుంచి రెండు స్కూటీలపై వస్తుండగా జీగిరాం వద్ద రూరల్ పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా స్కూటీలను తనిఖీ చేయగా, వాటిలో ఉన్న బట్టల బ్యాగ్ నుండి సుమారు 24.6 కేజీల బరువు గల గంజాయిను పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి ఒడిశాలో పొట్టంగి బ్లాక్ గంగరాజుపూర్ గ్రామానికి చెందిన సుశాంత్ బంక వద్ద నుంచి రెండు స్కూటీలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

'పిఎంశ్రీ'కి 19 పాఠశాలలు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం ఎస్ హెచ్ ఆర్ ఐ - పిఎం శ్రీ) పథకానికి జిల్లా నుంచి 19 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక చేసినట్లు కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం శ్రీ పథకానికి జిల్లా నుంచి 19 పాఠశాలలు అర్హత సాధించాయని, అందులో 2 ప్రాథమిక పాఠశాలలు, 17 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ పాఠశాలల్లో జాతీయ విద్యా విధానం అమలులో ఉంటుందన్నారు. ఈ పథకం అయిదేళ్ల అమలు జరుగుతుందని చెప్పారు. ఈ 19 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గానూ ఈ పథకం ద్వారా అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా అందజేసే నిధులతో పాఠశాలలో ప్రయోగశాలలు, విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలు సమకూర్చుకోవడం, డిజిటల్ పద్ధతిలో బోధన తదితర సౌకర్యాలు కల్పించుకోవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పిఎం శ్రీ పాఠశాలలో ఇప్పటికే వెబ్ సైట్లు, సోషల్ మీడియా ప్లాట్ ఫాంలు ఏర్పాటు చేశామని చెప్పారు. పిఎం శ్రీ కింద 14 పాఠశాలలకు క్రీడా మైదానాలకు, ఐదు పాఠశాలకు అటల్ టింకరింగ్ లాబ్‌లకు నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సాంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారందించేందుకు ప్రకృతి, పర్యావరణం పట్ల ఆసక్తి, అవగాహన కల్పించేందుకు మనబడి మనతోట కార్యక్రమం అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో గల 1594 పాఠశాలలో భూమి అందుబాటులో గల 1272 పాఠశాలల్లో ఈ పథకం ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పెంచనున్నట్టు తెలిపారు. అందుకు అవసరమైన 10 రకాల కూరగాయలు, 5 రకాల ఆకుకూరల విత్తనాలు గల కిట్లను పాఠశాలలకు అందించనున్నట్టు తెలిపారు. మన బడి మన తోట నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 149 మంది ఉపాధ్యాయులకు జట్టు ట్రస్టు ద్వారా శిక్షణ అందించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. మన బడి మన తోట ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకంలో వినియోగించడం జరుగుతుందని తెలిపారు.



పిఎంశ్రీ మార్గదర్శకాలను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

బంగారు భవిత కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, విద్యాప్రమాణాలకు సంబంధించి పూర్తి సమాచారంతో రిపోర్టులను రూపొందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. అందులో విద్యార్థుల విద్యకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టుతో పాటు, వారి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులకు ప్రతినెలా రక్తహీనతకు సంబంధించిన పరీక్షలు నిర్వహించిన వివరాలు నమోదు చేస్తామన్నారు. మై స్కూలు మై ప్రైడ్ ప్లస్ కార్యక్రమం ద్వారా ఉత్తీర్ణత శాతం పెంచడంతో పాటు, విద్యాప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టరు తెలిపారు. విలేకరుల సమావేశంలో డిఇఒ జి. పగడాలమ్మ, పిఎంయు నోడల్ అధికారి లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మెంబర్‌గా భంజ్‌దేవ్

అనుచరుల్లో తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి - సాలూరు

మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్‌కు రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించింది. ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల భర్తీ జాబితాలో భంజ్ దేవ్‌ను కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పై ఆయన అనుచరులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన భంజ్‌దేవ్‌కు డైరెక్టర్ పదవి కేటాయించడంపై ఆయన కూడా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత, సిఎం చంద్రబాబు నాయుడును కలిసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. డైరెక్టర్ పదవి చేపట్ట వద్దని ఆయన అనుచరులు ఒత్తిడి చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఎపి ట్రైకార్ బోర్డు మెంబర్‌గా పువ్వల లావణ్య

కురుపాం : టిడిపి నాయకులు పువ్వల లావణ్యను ఎపి ట్రైకార్ బోర్డు మెంబర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం విడుదల చేసిన మొదటి విడత నామినేటెడ్ పోస్టులు భర్తీ ఉత్తర్వుల్లో ఎపి ట్రైకార్ బోర్డు చైర్మన్‌గా బోరుగుల శ్రీనివాస్‌తో పాటు ఐదుగురు సభ్యుల పేర్లు విడుదల చేశారు. లావణ్య 2024ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ ఆశించిన వారిలో ఒకరు. ఈమెకు నియోజకవర్గంలో పలువురు కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



అటవీశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

మండలంలోని బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం జారీ చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమీప గ్రామాల గిరిజనులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యాన గిరిజనులు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ర్యాలీగా ముందు జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లి అక్కడ వినతిపత్రం అందజేశారు. అక్కడ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. ఇచ్చిన అనుమతులు రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంటు దాసు, మండల నాయకులు పాలమిట్ట రాము తదితరులు పాల్గొన్నారు.

-ప్రజాశక్తి, పార్వతీపురం

ఈదురు గాలులతో మొక్కజొన్నకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లాలో గత రెండు రోజులుగా వీస్తున్న ఈదురు గాలులు, కురుస్తున్న వర్షంతో పలు రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సోమవారం పార్వతీపురంలో 38.8 వర్షపాతం నమోదు కాగా, ఈ వర్షంతో పాటు వీచిన గాలులకు ఆడారు, డీకే పట్నం, బుదురువాడ పంచాయతీల్లో మొక్కజొన్న పంట నేలకొరిగిపోయింది. అదేవిధంగా మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాల్లోనూ మొక్కజొన్నకు నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారులను ప్రశ్నించగా సంబంధిత మండల వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేశామని పంట నష్టం అంచనా వేస్తున్నట్లు తెలిపారు.



బుదురువాడలో నేలకొరిగిన మొక్కజొన్న

వంద రోజుల్లో పరిపాలన అట్టర్ ఫ్లాప్ : రాజన్నదొర

సాలూరు : రాష్ట్రంలో వందరోజుల్లో టిడిపి కూటమి ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు కల్లబొల్లి హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని చెప్పారు. వందరోజుల్లో ఏదో సాధించామన్నట్లుగా ఇది మంచి ప్రభుత్వం అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో వందరోజులకే సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత లేదని అన్నారు. పింఛన్లు మంజూరు పంపిణీ చేసి గొప్పలు చెప్పుకొంటున్నదని చెప్పారు. ఏటా లక్షలాదిఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను ప్రభుత్వం మోసగించిందన్నారు. మూడునెలల్లో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో ఉన్నాయన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పక్కాగా దసరా ఉత్సవాల ఏర్పాట్లు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక కోట దుర్గ అమ్మవారి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్ కలెక్టరు ఎస్.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 3నుంచి 12వరకు జరిగే కోట దుర్గ అమ్మవారి దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో మంగళవారం సబ్ కలెక్టరు వారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టరు మాట్లాడుతూ సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి దర్శనం చేసుకొనేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలీస్ బందోబస్తు తగినంత ఏర్పాటు చేసి, ఎటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాత్రికులకు మంచినీరు సరఫరా చేయాలని, పారిశుధ్యం నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన అన్ని మందులు అందుబాటులో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రసాదం తయారీలో పరిశుభ్రత విధిగా పాటించాలని - ఎటువంటి కల్తీ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో డిఎస్‌పి రాంబాబు, తహశీల్దార్ పి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావు, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, కోటదుర్గగుడి ఇఒ మురళీకృష్ణ, విద్యుత్, ఎలక్ట్రికల్, అగ్నిమాపక శాఖల వారు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్, ఐటిడిఎ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హత కలిగి ఉద్యోగావకాశాలు లేక ఇబ్బంది పడుతున్న యువతకు ఇదొక మంచి కార్యక్రమమని అన్నారు. పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ చదివిన వారు పెద్ద పెద్ద కంపెనిలలో ఉద్యోగాలు సాధించాలని ఆశించారు. బిఇడి, టిటిసి చేసిన వారు డిఎస్‌సి రాసి టీచర్ ఉద్యోగాలు సాధించాలని కలెక్టర్ అన్నారు. త్వరలో జిల్లాలో సుమారు 200 మందికి డిఎస్‌సి శిక్షణ కూడా మొదలు పెడతామని పేర్కొన్నారు. దేహదారుడ్యం ఉన్న యువత ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో చాలా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆర్మీ సెలక్షన్ కి వెళ్లే అభ్యర్థులు ఫిజికల్ టెస్ట్ లో సెలెక్ట్ అయితే వారి కోసం రాతపరీక్షకు కోచింగ్ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. పోలీస్ కానిస్టేబుల్ సెలక్షన్‌కు కూడా వెళ్లాలని కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. అమెజాన్, విప్రో లాంటి పెద్ద కంపెనీలు కూడా మంచి జీతంతో అవకాశాలు కల్పిస్తున్నాయని కలెక్టర్ వివరించారు. ఆర్‌ఆర్‌బి, బ్యాంక్ టెస్ట్ లు రాసే వారికోసం అభ్యర్థులు కోరితే కోచింగ్ ఇప్పిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహనా కల్పించాలని అభ్యర్థి కోరగా, తప్పకుండా కల్పిస్తామన్నారు. జాబ్ మేళాకు వచ్చిన మహిళలకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. మెడికల్ ఫీల్డ్ లో ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సింగ్ వంటి ఉద్యోగాలలో భద్రత ఉంటుందని, అగ్రికల్చర్‌లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కలెక్టర్ సూచించారు. హెూటల్ మేనేజ్మెంట్, బ్యూటీషియన్‌లో కూడా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవా, స్వర్ణాంధ్రప్రదేశ్ లో ప్రతీ ఒక్కరు భాగ్యస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ జాబ్ మేళాలో అరబిందో ఫార్మసీ, అవంతి ఫీడ్స్ లిమిటెడ్, జిఎంఆర్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 543 మంది అభ్యర్థులు హాజరు కాగా, 95 మంది ఎంపికయ్యారు. అరబిందో ఫార్మసీ మలి విడత ఎంపిక కార్యక్రమం చేపట్టనుంది. ఎంపికైన అభ్యర్థులు ఎమ్మెల్యే విజయచంద్ర, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ఎంపిక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ఐటిడిఎ ఎపిఒ మురళీ, ఐటిడిఎ, నైపుణ్య అభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పర్యాటక దినోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ అడ్వాంచర్ పార్క్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పిఒ మాట్లాడుతూ పార్క్‌లో లైటింగ్ పెంచాలన్నారు. అన్ని సాహస క్రీడలు పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అదే విధంగా ఐలవ్ సీతంపేట అనే నేమ్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పార్క్‌లోని క్రీడల ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, డిపిఒ సతీష్, పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్వర్ణాంధ్ర విజన్@ 2047పై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ కె.శ్రీనివాస్ మున్సిపల్ కార్యాలయంలో గల పలు విభాగాల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర - విజన్ @ 2047 ప్రణాళిక డాక్యుమెంట్ తయారీపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర @2047 యొక్క క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పలు వార్డు సచివాలయ పరిధిలో వార్డు సభలో నిర్వహిస్తున్నారని అలాగే మున్సిపల్, వార్డు సచివాలయల సెక్రెటరీలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో లాగిన్ చేసి ఆయా వార్డులకు సంబంధించిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల గూర్చి వారి అభిప్రాయాలను తెలియపర్చేలా వారికే అవగాహన కలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ డి.లక్ష్మి, రెవెన్యూ ఆఫీసరు రూబెన్ దిబ్బ, పలు విభాగాలు ఉద్యోగులు. సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టంలో తాగునీటి కష్టాలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుంది మేజర్ పంచాయతీ పరిస్థితి. చెప్పుకోడానికే మేజర్ పంచాయతే తప్ప సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అధికారులపై స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. వీరఘట్టంలోని రెండో సచివాలయ పరిధిలో బాబూ జగజీవన్ రామ్, గెడ్డకాలనీ, కస్పా, అక్కుల పేట వీధులకు ఏడాదిగా రక్షిత మంచినీటి పథకం కుళాయి పాయింట్ల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడం లేదు. దీంతో ప్రాంత మహిళలు ఎగువ ప్రాంతానికి వచ్చి నీరు పట్టుకొని తీసుకొని వెళ్లి గొంతును తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుళాయిల ద్వారా ఈ వీధులకు తాగునీరు వచ్చేసరికి చిన్నదార రావడంతో నీటి కోసం సమయం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా కొద్దిపాటి నీరు వస్తున్నప్పటికీ చలమల నీరు తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి గడపగడప కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో అప్పట్లో సచివాలయానికి రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు కేటాయించగా, ఇందులో కొంత నిధులతో మినీ వాటర్ ప్లాంట్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వ అధికారం కోల్పోవడంతో ఆ ప్లాంట్‌పై కూడా ఆశలు సన్నగిల్లినట్లు మహిళ ఆరోపిస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని ఈనెల 12న మేజర్ పంచాయతీ ఇఒ ఎం.రవికి మహిళలు వినతిపత్రం ఇచ్చారు. అయినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో వృధాగా పడి ఉన్న జలజీవన్ పైపులు

వృధాగా పడి ఉన్న జల జీవన్ పైపులు

మండల కేంద్రంలోని అన్ని వీధులకు జలజీవన్ మిషన్ పథకం రూ.56 లక్షలతో పనులు చేపట్టి అందరికీ తాగునీరందిస్తామని అధికారులు ప్రకటన చేశారు. అయితే ఎక్కడా పనులు ప్రారంభించకపోవడంతో పోలీస్ స్టేషన్ ఆవరణలో లక్షలాది రూపాయలు విలువ చేసే పైపులు వృధాగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే యుటిఎఫ్ లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కార సాధనకు యుటిఎఫ్ నిరంతర కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్ అన్నారు. మండలంలోని గాదెలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న స్వరోత్సవాల్లో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని, సంఘ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ విధానాలను ప్రతి ఉపాధ్యాయుడు అధ్యయనం చేయాలని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం చేయాలని, ఇది యుటిఎఫ్ విధానమని ఆయన చెప్పారు. తదుపరి మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు పూర్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్,శ్రీనివాసరావు, సీతానగరం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి. ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.గోవిందరావుతో పాటు అన్ని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు



గుమ్మలక్ష్మీపురంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జిల్లా వ్యాప్తంగా 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బలిజిపేట మండలం నారంనాయుడువలస, గుమ్మలక్ష్మీపురం మండలం చిన వంకాడర, దేరువాడరలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి పొలంపిలుస్తోంది వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అలాగే గరుగుబిల్లి మండలం తోటపల్లి, సంతోషపురం, గ్రామంలోను, సాలూరు మండలం కూర్మరాజుపేట, జీగిరాం, సీతంపేట మండలం కిల్లాడ, పెదపొల్లలో, పాచిపెంట మండలం గురివినాయుడుపేట, మోసూరు, కొమరాడ మండలం ఆర్తాంలో, వీరఘట్టం మండలం ఎం.రాజపురం, కురుపాం మండలం వలస బల్లేరు, మక్కువ మండలం సరాయివలస, భామిని మండలం బాలేరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రకృతి వ్యవసాయం, ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు, సమగ్ర ఎరువుల, పురుగుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలసాయం సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రసాయనాలు, పురుగుమందులు వినియోగం తగ్గించాలని, వ్యవసాయ అధికారులు సూచించిన మోతాదులోనే పంటలకు రసాయన ఎరువులు వాడాలని, తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, మట్టి నాణ్యత పెరుగుతుందని తెలిపారు. సాగు ఖర్చులు తగ్గించి నాణ్యమైన దిగుబడి పెంపే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు వారి సందేహాలను అధికారులను అడిగి నివతి చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహనరావు

గర్భిణుల వసతిగృహానికి ఫ్యాన్లు, బెడ్‌షీట్లు వితరణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి. జగన్మోహనరావు సాలూరులోని గర్భిణిల వసతి గృహానికి ఫ్యాన్లు, బెడ్ షీట్లు, పండ్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు యువాన్ జన్మదిన సందర్భంగా గర్భిణీల సౌకర్యం, ఆరోగ్యం దృష్ట్యా తన వంతుగా వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలకు పండ్లు,చిన్నారులకు బిస్కట్లు అందజేశారు. అనంతరం అక్కడ ఉన్న 17 మంది గర్భిణుల ఆరోగ్య స్థితిని పరిశీలించి, అందుతున్న వైద్య సేవలపై వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైటిసి మేనేజర్ సాగర్, నీడ్ స్వచ్ఛంద ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, సూపర్‌వైజర్ జయగౌడ్, ఆఫీసు సిబ్బంది వినోద్, వసతిగృహ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాంబాబు మాస్టారే కావాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామ పాఠశాలకు రాంబాబు మాస్టారే కావాలని మండలంలోని చిట్టిపుడివలస గ్రామస్తులు మంగళవారం ఎంఇఒ డి.గౌరునాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సాకేటి రాంబాబు ఐటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా నడుకూరు ఎంపియుపి పాఠశాలకు వెళ్లారు. రాంబాబు స్థానంలో శంబంగి చంద్రశేఖర్ తమ పాఠశాలకు వచ్చారు. ఆయన స్థానం మళ్లీ రాంబాబును నియమించాలని గ్రామస్తులు విన్నవించారు. రాంబాబు మాస్టర్ లేకపోవడంతో మా పిల్లల్లో కూడా క్రమశిక్షణ పోయిందని, పాఠశాలకు వెళ్లమని మొండి చేస్తున్నారని ఆరోపించారు. దీనికి ఎంఇఒ స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు.

ఘనంగా దయగలమాత మహోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పి.లేవిడి కొండపై గల దయగల మాత పుణ్యక్షేత్రం వద్ద మంగళవారం క్రైస్తవులు ఘనంగా ఉత్సవం నిర్వహించారు. పలువురు పాదర్లు భక్తులను ఉద్దేశించి సందేశమిస్తూ దేవుని తల్లి అయిన మరియమాతను ప్రార్థించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.



ఉపాధ్యాయులకు విత్తనాలను అందజేస్తున్న ఎంఇఒ

పాఠశాలలకు కూరగాయల విత్తనాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని 144 పాఠశాలలకు కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒ ఎస్.సత్యనారాయణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనబడి-మన తోట పథకంలో భాగంగా పాఠశాలలో ఖాళీ ప్రదేశంలో విత్తనాలు నాటి తద్వారా విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందివ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. కావున మండలంలో అన్ని పాఠశాలల్లో బడి తోటను పెంచి అంగన్వాడీ పిల్లలకు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలన్నదే దీని ఉద్దేశమని అన్నారు. కార్యక్రమం లో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

30 నుంచి కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ సమస్యలను ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టడం లేదని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ఆసుపత్రిలో శానిటేషన్, పేస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లుగా, కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నెలవారీ జీతాలు చెల్లించడం లేదని, తమ సమస్యలను అధికారులకు విన్నవిస్తే విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఈనెల 16 నుంచి దశలవారీగా ఆందోళన చేస్తున్నా ఎటువంటి ఫలితం లేదన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30 నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వైద్యులకు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు పోలూరు వెంకటరావు, బారికి, సునీల్, ప్రసాదు, ఇందిర, గౌరమ్మ ఉన్నారు.

జిఒ 85ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిఒ 85ను రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వ వైద్యులు చేపట్టిన నిరసన కార్యక్రమాల దృష్ట్యా ప్రజలకు వైద్య సేవలకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి తెలిపారు. 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తపై వివరణ ఇస్తూ వైద్యులతో నిరంతరం సంప్రదిస్తున్నామని, వైద్య సేవలకు అంతరాయం కలిగిన ఎడల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాలల నుంచి, ఇతర మార్గాల ద్వారా వైద్యుల సేవలను వినియోగించుకొనేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు ఆమె తెలిపారు.

తుపాను బాధితులకు ఆర్థికసాయం


ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కృష్ణరాయపురం సర్పంచ్ అన్నంనాయుడు విజయవాడ తుపాన్ బాధితుల కోసం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు అందజేశారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయాలని ఎమ్మెల్యే చేశారు. అలాగే టిడిపి ప్రభుత్వం వచ్చి 100రోజులు పూర్తి చేసుకుని సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కేక్ కట్ చేశారు.

తలసేమియా కేంద్రాన్ని పునః ప్రారంభించాలి

ప్రజాశక్తి - సీతానగరం

తలసేమియా కేంద్రాన్ని పునః ప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు సవరపు రామారావు పార్వతీపురం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెలిమియా వ్యాధిగ్రస్తుల కోసం గతంలో ఐటిడిఎ పిఒ కేర్ సి సెంటర్‌ను ఏర్పాటు చేశారని, అయితే ఇప్పుడు ఆ సెంటర్ మూతపడడంతో జనరల్ ఈ వ్యాధిగ్రస్తులకు రక్తం ఎక్కించేటప్పుడు ఇద్దరికి ముగ్గురికి ఒకే మంచంపై ఎక్కించడం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. కావున వెంటనే ఈ సెంటర్‌ను వెంటనే పునఃప్రారంభించాలని కోరారు.



జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిని అందజేస్తున్న రామారావు

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పేదల సంక్షేమ, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని లోవముతా ప్రాంతమైన చినవంకదార గిరిజనలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను కలిసి మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించారు. అనంతరం కరపత్రాలు అందజేశారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. గిరిజన సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపిడిఒ గౌరీ శంకర్రావు, ఎపిఎం ఆదయ్య, జర్న సర్పంచ్ కె.ఉష, గొయ్యిపాక సర్పంచ్ కె.లక్ష్మీ, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, టిడిపి నాయకులు, సచివాలయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

వీరఘట్టం : మండలంలోని దశమంతపురంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ని అతికించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం పథకాలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎ.కుమారస్వామి, సచివాలయ కార్యదర్శి కె.సునీల్ కుమార్ , సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కిల్లాడ పంచాయతీ క్లస్టర్ పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఆధ్వర్యాన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊయక సరస్వతి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు సుబ్బారావు, భాస్కరరావు, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చినవంకదారలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పాలకొండ :స్థానిక శ్రీ రామ కళామందిర్ సచివాలయానికి సంబంధించిన 11, 12 వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీసు శ్రీకాకుళం వారిచే కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో తడి, పొడి చెత్త వేరు చేయడం, పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ మొదలగు విషయాల గురించి ప్రజలకు పాటల రూపంలో వివరించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కమిషనర్ సర్వేశ్వరరావు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సత్వర పరిష్కారమయ్యేలా వాటిని పరిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, కూటమి నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని మదలింగిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు ఎస్ శేఖర్ పాత్రుడు ఆధ్వర్యాన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలు స్వాగతించి సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్ కళావతి తదితరులు పాల్గొన్నారు.



అదనపు భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

విద్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యారంగం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం కొత్తవలసలో కొత్త పోలమ్మ ఉన్నత పాఠశాలలో ఆర్ఎంఎస్ఎ నిధులు రూ.40.20 లక్షలతో నిర్మించిన అదనపు నూతన భవనాన్ని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగం అభివృద్ధి జరగాలంటే అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, డిఇఒ జి.పగడాలమ్మ, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, టిడిపి నాయకులు గొట్టాపువెంకటనాయుడు, 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, స్కూల్ కమిటీ చైర్మన్ శెట్టి నీలిమ, ప్రధానోపాధ్యాయులు వై. అప్పలనాయుడు, సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగం అధికారులు, స్కూల్ కమిటీసభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పరిధిలోని జగన్నాథపురంలో గ్రంథలయాన్ని ఏర్పాటు చేయాలని, జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు వలిరెడ్డి జగదీష్, టిడిపి పట్టణ కార్యదర్శి మజ్జి వెంకటేష్, జగన్నాథపురం యువత అన్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం కమిషనర్‌తో మాట్లాడుతూ జగన్నాథపురంలో 1, 29, 30 వార్డులున్నాయని, ఇక్కడ చదువుకునే యువత, నిరుద్యోగ యువకులు ఎప్పటి నుండో గ్రంథాలయం ఉండాలని కోరికతో ఉన్నామన్నారు. గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తే యువత వ్యసనాల బారిన పడకుండా పుస్తక పఠనం వల్ల మంచి విజ్ఞానం సాధిస్తారని, ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. జగన్నాథపురంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఒరియా పాఠశాల భవనం ఖాళీగా ఉందని, అందులో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పాఠశాల భవనాన్ని పరిశీలించి గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు.

1324 లీటర్లు సారా నేలమట్టం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి, సీతంపేట పోలీస్ స్టేషన్లలో ఈ ఏడాది అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడి సీజ్ చేసిన 1324.75 లీటర్ల నాటుసారాను మంగళవారం నిర్వీర్యం చేసినట్లు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. 36 కేసుల్లో పట్టుబడ్డ ఈ సారాను మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశామన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రంలో గల గుడివాడ కాలనీ పాఠశాలను ఎంఇఒ-1 సామల సింహాచలం మంగళవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో బడి తోటను పెంచాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల డైరీ, లెసన్ ప్లాన్‌లను పరిశీలించారు. బోధన సమయంలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తప్పనిసరిగా ఉపయోగించాలని ఆదేశించారు.

చోరీ కేసును చేధించిన పోలీసులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పెద్దబొండపల్లిలో జులై 27న జరిగిన దొంగతనం కేసును పోలీసులు చేధించినట్లు ఎఎస్‌పి అంకిత సూరన్ మహవీర్ తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెదబొండపల్లికి కె.మణమ్మ తన ఇంట్లో జరిగిన దొంగతనంలో 16 తులాల బంగారం పోయినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. ఈ మేరకు దర్యాప్తు చేయగా, డి.లక్ష్మణరావు దొంగతనం చేసినట్లు పోలీసుల విచారణలో తేలగా, అతడిపై మాటు వేసి పట్టుకున్నట్లు తెలిపారు. కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి ప్రాపర్టీ రికవరీ చేసినట్లు తెలిపారు. కేసులో దర్యాప్తు చేసిన పోలీసులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో పట్టణ రూరల్ ఎస్సైలు గోవిందా, దినకర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకారం : వైస్ ఎంపిపి

ప్రజాశక్తి - సాలూరురూరల్

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలను ప్రభుత్వం తీసుకున్నట్లయితే ప్రతిపక్ష పార్టీగా తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ జి.పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక సర్పంచులను, ఎంపిటిసిలను పిలవాలని, వారిని పిలవకుండా ఒక్క టిడిపి నాయకులే పిలడం ఎంతవరకు సబబని అన్నారు. ఉపాధి హామీ చట్టం కింద గ్రామాల్లో చేపట్టే కార్యక్రమాలకు ఆ గ్రామ పరిధిలో తీర్మానాలు చేసి అంగీకరించి చేయవచ్చునని, అలా కాకుండా అధికారులు వారికి తోచినట్టు చేసినట్లయితే ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఎంఇఒ రాజ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖ ప్రగతిని వివరించారు. మామిడిపల్లి పిహెచ్‌సి ఎఒ తిరుపతిరావు మాట్లాడతూ మండలంలో జ్వరాలు బాగా తగ్గుముఖం పట్టాయని, అన్ని పిహెచ్ సిల్లో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మావుడి సబ్‌సెంటర్‌కు విలువైన ఫ్రిజ్, కూలర్ ప్రభుత్వం అందించిందని, అయితే ఆ సెంటర్‌కు విద్యుత్ లేక పోవడంతో అవి పాడైపోతున్నాయని ఆ గ్రామసర్పంచి తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ఎఇ వరలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని చంద్రప్ప పేట నుండి మూగడ వలస, కుర్మరాజుపేట నుండి పునికిల వలస, ఖరాసు వలస నుండి గడి వలస వరకు సుమారు రూ.3.65 కోట్లతో బిటి రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. విద్యుత్‌శాఖ డిఇ కిశోర్ మాట్లాడుతూ కొత్తగా గుమడాం దగ్గర సబ్ స్టేషన్ పనులు సాగుతున్నాయని తెలిపారు. తోనాం సర్పంచ్



సమస్యలను అధికారులకు వివరిస్తున్న సభ్యులు

మువ్వల ఆదయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలో విద్యుత్ వైర్లు ఇంటిపై నుండి వెళు న్నాయని, వీటిని సరి చేయమని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా కనీసం పట్టించుకోవటం లేదని తెలిపారు. దీనికి డిఇ మాట్లాడుతూ ఇళ్లపై నుండి వెళ్తున్న కరెంటు వైర్లను తొలగించాలంటే కొంత మొత్తాన్ని చెల్లించాలని, అప్పుడే వాటిని తొలగించగలమని ఆయన సమాధానం చెప్పారు. మండల వ్యవసాయాధికారి అనురాధ పండా మాట్లాడుతూ ప్రతి రైతు ఇకెవైసి తప్పకుండా చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, పలుశాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

శుద్ధ జలాల సరఫరాకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రజలకు రాబోవు రోజుల్లో స్వచ్ఛమైన జలాల సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. తోటపల్లి వద్ద ఉన్న నాగావళి నది పరివాహక ప్రాంతంలో ఉన్న పంపు హౌస్ వద్ద శుద్ధ జలాల సరఫరాకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది చేపట్టిన సాంకేతిక పనులను మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్, ఎఇ ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా రంగు మారిన నీరు సరఫరా జరుగుతున్న దృష్ట్యా శుద్ధ జలాలను సరఫరా చేసేందులో గత మూడు నెలలుగా చేపట్టిన ప్రణాళికలతో పంప్ హౌస్ వద్ద కొత్తగా 3 బోర్లు, రెండు రీఛార్జ్ వెల్స్ ను నిర్మించినట్లు తెలిపారు. దీనివల్ల గంటకు 60 వేల లీటర్లు రోజుకు అదనంగా 6 లక్షల లీటర్లు నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. తోటపల్లి గేట్లు ఎత్తిన సమయంలో, రాబోయే వేసవి కాలంలో కూడా మంచినీటి లభ్యత పెంపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

పిల్లలు ప్రయోజకులు కావాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారని అందుకు భిన్నంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, కావున దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఎస్ఐ పి.అనీష్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, వాటి వాడుక ద్వారా కలిగే హానికరమైన దుష్ప్రభావాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికి, ఆరోగ్యానికి, కుటుంబానికి, సమాజానికి ఎంతటి హానికరమనే విషయాలను వివరించారు. విద్యార్థులు ఇలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వాడుక వల్ల వారి భవిష్యత్ పాడవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల వాడుకపై అవగాహన పెరిగి, తమ జీవితాలను సకారాత్మక దిశగా తీసుకెళ్లేందుకు తోడ్పడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది పాల్గొన్నారు

శివశంకర్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన మొదటి విడత నామినేటెడ్ పోస్టులు భర్తీలో జనసేన నుంచి ఎపిఎంఎస్ఎంఇ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా తమ్మిరెడ్డి శివశంకర్ నియమించడం పట్ల కురుపాం నియోజకవర్గ జనసేన ఇన్చార్జి కద్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విశాఖపట్నం తన ఇంటి వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ జనసేన నాయకులు నేరేడుబిల్లి వంశీ, అధికారి అనిల్, తాడేల శ్రీరాముల నాయుడు, శివప్రసాద్, దత్తి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - కురుపాం

పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు అన్నారు. మంగళవారం పాఠశాల వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని విద్యార్థులతో స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని దశమంతపురంలో స్వచ్ఛత హీసేవ కార్యక్రమం సర్పంచి వావిలపల్లి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో పర్యటించి పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కే సునీల్ కుమార్, సచివాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. కో ఆర్డినేటర్ కోట్ల శ్రీనివాసరావు



సాలూరులో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఐటిఐ విద్యార్థులు

ఆధ్వర్యాన పరిసరాల శుభ్రత పై ప్రతిజ్ఞ, ఐటిఐ పరిసరాల్లో చెత్తను తొలగించడం, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసన్న కుమార్, చంద్రశేఖర్, వెంకటలక్ష్మి, జగదీశ్, తిరుపతిరావు, సారధి, ఆఫీస్ సూపరింటెండెంట్ రామినాయుడు, పాల్గొన్నారు.

నిర్మించారు... వదిలేశారు

ప్రజాశక్తి - వీరఘట్టం

లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు ఉపయోగించకుండా నిరుపయోగంగా విడిచిపెట్టడంతో ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నారు. ఈ భవనాలు వినియోగించుకుంటే ఎంతో ప్రయోజనంతో పాటు ప్రభుత్వానికి ఖర్చు కూడా తగ్గుతుంది. ఇలాంటి పరిస్థితి మండల కేంద్రంలో నెలకొంది. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణంలో విద్యార్థుల కోసం ఇటీవల కాలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి మూడు అదనపు భవనాలు నిర్మించారు. అంత వరకూ బాగానే ఉన్నది. అయితే భవనాలను కొంతకాలం తర్వాత విడిచిపెట్టడంతో పనికిరాని సామగ్రిని ఉంచేందుకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనాలను ఉపయోగించుకుంటే కొంతమేర పాఠశాల విశాలంగా ఉంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఈ మూడు భవనాలను పక్కన పెట్టి గత ఏడాది పిఎం శ్రీ పథకం కింద సుమారు రూ.15 లక్షలపైబడి అంచనా వ్యయంతో సైన్సు ల్యాబ్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. డివిజన్లోని ఒక్క వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)ను ఎంపిక చేసి లక్షలు వెచ్చించి భవనాలు నిర్మిస్తున్నారు. కొంతకాలం అయిన తర్వాత వాటిని వృధాగా విడిచిపెట్టడంతో విశాలంగా ఉండాల్సిన పాఠశాల ఆవరణ కూడా భవన నిర్మాణాల వల్ల ఇరుకైపోతుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణ పనులు చేపట్టి దాదాపుగా ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ ప్రస్తుతం భవన నిర్మాణ పనులు లెంటల్ లెవెల్ దశలో ఉంది. ఇప్పటికైనా అధికారులు పాఠశాలలో ఉన్న భవనాలను పునఃపరిశీలన చేసి తదనంతరం కొత్త భవన నిర్మాణాలు చేపడితే బాగుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణంలో మధ్యలో నిలిచిపోయిన భవనం

మన ఇల్లు - మన గౌరవంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఎంవి కూర్మారావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సహకారమందించి వంద రోజుల్లో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. అన్ని పంచాయతీల్లోనూ ఈ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు నిర్దేశించారు. ప్రతి పంచాయతీలోనూ నిర్దేశించిన వాటిని పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు. సమావేశంలో డిఇ సోమేశ్వరరావు, తహశీల్దార్ జె.రాములమ్మ, హౌసింగ్ ఎఇ జానకీరామ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం ఒక కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. శ్రీ సత్య సాయి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ బి.లక్ష్మీనారాయణ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్యసాయి విద్యాసంస్థలు అకాడమిక్ అడ్వైజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఉన్నతమైన స్థానాన్ని చేరడానికి క్రమశిక్షణ, నిర్దిష్టమైన విద్యాప్రణాళికలతో పాటు మనస్సును ఉల్లాసపర్చడానికి ఇలాంటి ఫ్రెషర్స్ డే వేడుకలు ఉపయోగపడతాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటరమణ, ఎఒ కైలాసరావు, సత్యం స్కూల్ ఎఒలు కేశవరావు, కృష్ణారావు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

40మంది పై కేసులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన కొట్లాటలో నలుగురికి గాయాలయ్యాయని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ సత్యంనాయుడు గాయపడ్డవారిలో ఉన్నారని తెలిపారు. రెండు వీధులకు చెందిన 40మందిపై కేసులు పెట్టినట్లు ఆయన చెప్పారు.

స్నేహితుడికి కన్నీటి వీడ్కోలు

కురుపాం: దాడిలో తీవ్రంగా గాయపడి కెజిహెచ్ లో చికిత్స పొందుతూ మృతి చెందిన గౌడు శ్రీధర్(24) మృతదేహం సోమవారం అర్ధరాత్రి కురుపాం చేరుకోగా స్నేహితులు ఊరు చివర నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి శ్రీధర్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ శోకసంద్రంలో మునిగిపోయారు. మిత్రుడు ఇక లేడని అంతా కన్నీరు మున్నీరుగా రోదించారు. తల్లిదండ్రులకు, భార్యకు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు